జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 103 26-4-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
జాతీయ దిన పత్రిక తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

## తెలంగాణలో ఎండల ఉగ్రరూపం..



- వడదెబ్బకు నలుగురి బలి
- రాష్ట్రంలో కొనసాగుతున్న తీవ్రమైన ఎండలు
- మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- నాగర్‌కర్నూల్‌లో పిడుగుపాటుకు ఒక యువకుడి మృతి
- పలు జిల్లాల్లో 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

మిగతా 2లో



## ట్రంప్ విందులో కాల్పులు...

- ఇదే అదనుగా ఖరీదైన వైన్ బాటిళ్లు ఎత్తుకెళ్లిన 'అతిథులు'
- వైట్‌హౌస్ డిన్నర్‌లో కాల్పుల కలకలం
- గందరగోళంలో వైన్ బాటిళ్లు పట్టుకెళ్లిన కొందరు అతిథులు
- అధ్యక్షుడు ట్రంప్‌ను సురక్షితంగా తరలించిన భద్రతా సిబ్బంది
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- జర్నలిస్టుల తీరుపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు

2లో



## ఇక మా టైం మొదలైంది: కవిత

- తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో కవిత కొత్త పార్టీ
- 'మీ టైం అయిపోయింది, మా టైం మొదలైంది' అంటూ సంచలన ట్వీట్
- పార్టీ ఆవిర్భావ సభలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై తీవ్ర విమర్శలు
- తండ్రి కేసీఆర్ పార్టీ పాత పేరుతోనే కొత్త రాజకీయ ప్రయాణం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ ప్రయాణాన్ని అధికారికంగా ప్రారంభించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన ఆమె, ఆ తర్వాత చేసిన తొలి ట్వీట్ రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. 'మీ టైం పూర్తయ్యింది.. మా టైం మొదలైంది" అంటూ ఎక్స్‌లో ఆమె పోస్టు పెట్టారు. శనివారం హైదరాబాద్‌లోని మునీరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కవిత తన పార్టీ పేరును అధికారికంగా ప్రకటించడం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాజకీయాల్లో తన పార్టీ ఒక కొత్త శక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేస్తున్న కవిత, ఎట్టకేలకు సొంత పార్టీతో ప్రజల ముందుకు వచ్చారు.దఈ పరిణామంలో అత్యంత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, తన తండ్రి కేసీఆర్ స్థాపించిన పార్టీ అసలు పేరు 'తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)'ని పోలి ఉండేలా 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' అని నామకరణం చేయడం. బీఆర్ఎస్ నుంచి వేరుగా, సొంత రాజకీయ అస్తిత్వం కోసం కవిత ఈ నిర్ణయం తీసుకోవడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆమె చేసిన ట్వీట్, ఎవరిని ఉద్దేశించిందనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి.

2లో

## ప్రజా'వాణి' వినాలి

ఫిర్యాదుల పరిష్కారంలో రాజీ వద్దు.. ఆలస్యమైతే అధికారులదే బాధ్యత



- ప్రజావాణిపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- రాష్ట్ర, జిల్లా స్థాయి నుంచి రెవెన్యూ డివిజన్ స్థాయికి.. తర్వాత మండల స్థాయికి విస్తరించాలి
- ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల అధికారులకు పూర్తి అధికారం
- గడువులోగా పరిష్కారం.. ట్రాకింగ్‌కు డిజిటల్ ప్లాట్‌ఫాం

హైదరాబాద్: 'ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలి. ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలి. సంబంధిత విభాగాలకు పంపించాలి. పరిష్కార పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలి'అని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువు ఉండాలని, ఆలస్యం జరగకూడదని చెప్పారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని సూచించారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతి తెలుసుకునే వీలుండాలని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులను చేయాలని చెప్పారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీఎంఓ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా ఇకపై రెవెన్యూ డివిజన్ స్థాయికి, తర్వాత దశలో మండల స్థాయికి విస్తరించాలన్నారు. దూర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి



## బెంగాల్లో గూండారాజ్

- దుండగులను కోర్టుకీడుస్తాం: మోదీ
- మహిళలకు భద్రత కల్పిస్తామని హామీ

కోల్‌కతా: టీఎంసీ పాలనలో పశ్చిమ బెంగాల్లో గూండారాజ్ సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. మహిళలను వేధించే గూండాలకు తృణమూల్

2లో



## శక్తి యాప్‌తో యువతికి రక్షణ..

- శక్తి యాప్ ద్వారా యువతిని రక్షించిన మంగళగిరి గ్రామీణ పోలీసులు
- పోలీసుల పనితీరును ట్విట్టర్ వేదికగా ప్రశంసించిన మంత్రి లోకేశ్
- అనుమానాస్పదంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌ను అరెస్ట్ చేసిన వైనం

## ఈసారి ప్లీనరీ లేదు..

- ప్రతీచోట గులాబీ జెండాలు ఎగరాలన్న కేటీఆర్
- బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాలు ఎగరేయాలని పిలుపు
- సోమవారం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం
- వేసవి తీవ్రత దృష్ట్యా ప్లీనరీకి బదులు కార్యవర్గ సమావేశం
- ఆహ్వానం ఉన్నవారు మాత్రమే రావాలని నేతలకు కేటీఆర్ సూచన
- నియోజకవర్గాల్లోనే వేడుకలు జరపాలని కార్యకర్తలకు విజ్ఞప్తి

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ జెండాలు ఎగరేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం నాడు పార్టీ నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ విషయం తెలిపారు. గ్రామాలు, పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాల్లో జెండా వందనం చేసి వేడుకలు జరపాలని అన్నారు.



## పెట్రోల్, డీజిల్ కొరతతో బంకుల మూసివేత..

- రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరతపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్యానిక్ కొనుగోళ్లతో 50 శాతానికి పైగా పెరిగిన డిమాండ్
- సరఫరా లేక 400కు పైగా పెట్రోల్ బంకులు మూసివేత
- ప్రజలు ఇబ్బంది పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశం
- సాయంత్రంలోగా నివేదిక ఇవ్వాలని అధికారులకు సీఎం డెడ్‌లైన్

రాష్ట్రంలో పలుచోట్ల పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడి బంకులు మూతపడుతున్న విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. ముంబై నుంచి అమరావతికి బయలుదేరే ముందు ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఇంధన లభ్యత, సరఫరాలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీసి, కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు జిల్లాల వారీగా ప్రస్తుత పరిస్థితిని సీఎంకు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4,510 పెట్రోల్ బంకులు ఉండగా, సరఫరా సమస్యల కారణంగా దాదాపు 421 బంకులు మూతపడినట్లు తెలిపారు. కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో ప్రజలు అవసరానికి మించి కొనుగోలు చేస్తుండటమే (ప్యానిక్ బయింగ్) ఈ పరిస్థితికి ప్రధాన కారణమని అధికారులు పేర్కొన్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


# శక్తి యాప్‌తో యువతికి రక్షణ..

శక్తి యాప్, పోలీసుల అప్రమత్తత ఓ యువతిని అర్ధరాత్రి ఆపద నుంచి సురక్షితంగా బయటపడేశాయి. అనుమానాస్పదంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్ బారి నుంచి ఇంజినీరింగ్ విద్యార్థినిని కాపాడిన మంగళగిరి గ్రామీణ పోలీసులను మంత్రి నారా లోకేశ్ అభినందించారు. మహిళల భద్రతకు టెక్నాలజీ ఎంతగా ఉపయోగపడుతుందో ఈ ఘటన నిరూపించిందని ఆయన పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. నంబూరుకు చెందిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని అర్ధరాత్రి బెంగళూరు నుంచి విజయవాడ బస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కారు. మార్గమధ్యలో నిర్మానుష్య ప్రాంతంలో ఆటో డ్రైవర్ బొమ్మనపల్లి ఫణీంద్రకుమార్ వాహనం వేగాన్ని తగ్గించి, అసభ్యంగా మాట్లాడటం మొదలుపెట్టాడు. దీంతో భయపడిన యువతి, వెంటనే తన ఫోన్‌లోని శక్తి యాప్ ద్వారా ఎమర్జెన్సీ బటన్ నొక్కారు. అలర్ట్ అందుకున్న మంగళగిరి గ్రామీణ పోలీసులు, ఎస్సై వెంకట్ నేతృత్వంలోని బృందం వెంటనే రంగంలోకి దిగింది. యాప్ ద్వారా వచ్చిన లైవ్ లొకేషన్ ఆధారంగా ఆటోను కాజా సమీపంలో అడ్డగించి డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. యువతిని సురక్షితంగా ఆమె ఇంటికి చేర్చారు. ఈ ఘటనపై మంత్రి నారా లోకేశ్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. "అర్ధరాత్రి యువతిని కాపాడిన మంగళగిరి పోలీసులకు అభినందనలు. శక్తి యాప్ ద్వారా సమాచారం రాగానే వేగంగా స్పందించి ఆమెను సురక్షితంగా ఇంటికి చేర్చారు. సోదరీమణులారా, మీ ఫోన్లలో శక్తి యాప్‌ను తప్పక ఇన్‌స్టాల్ చేసుకోండి. ఇది ప్రాణాలను కాపాడుతుంది" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఘటనపై గుంటూరు డీఎస్పీ మురళీకృష్ణ మీడియాకు వివరాలు వెల్లడించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# తెలంగాణలో ఎండల ఉగ్రరూపం..

తెలంగాణలో సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో జనం అల్లాడిపోతున్నారు. వడదెబ్బ కారణంగా శనివారం ఒక్కరోజే నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. హనుమకొండ జిల్లాకు చెందిన సాదుల నరహరి (58), వరంగల్‌కు చెందిన ఎండీ యాకూబీ (63), మంచిర్యాల జిల్లా వాసి కొట్రంగి జయరాం (40), సూర్యాపేట జిల్లాకు చెందిన మామిడి నరసింహ (51) వడదెబ్బతో మరణించారు. వీరంతా పనులకు వెళ్లి అస్వస్థతకు గురైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మరోవైపు, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠంగా 44.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కుమరంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాల్లోని పలుచోట్ల 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కామారెడ్డి, ఆదిలాబాద్, భూపాలపల్లి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ ఎండల తీవ్రత కొనసాగుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో పిడుగుపాటుకు ఓ యువకుడు మృతి చెందాడు. బల్మూరు మండలం మైలారం గ్రామానికి చెందిన గట్టు సలేశ్వరం (19) పొలంలో గేదెలను కాస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలు కావడంతో రక్షణ కోసం తాటిచెట్టు కిందకు వెళ్లాడు. అదే సమయంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మరణించాడు.

# ఈసారి ప్లీనరీ లేదు..

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. వాస్తవానికి ప్లీనరీ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, ఇటీవల జగిత్యాలలో భారీ సభ నిర్వహించడం, ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఈసారికి కార్యవర్గ సమావేశానికే పరిమితం చేస్తున్నట్లు వివరించారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులకు మాత్రమే ఆహ్వానాలు పంపినట్లు పార్టీ స్పష్టం చేసింది. ఆహ్వానం ఉన్నవారు మాత్రమే తెలంగాణ భవన్‌కు రావాలని, మిగతా నాయకులు తమ తమ నియోజకవర్గాల్లోనే ఉండి వేడుకలు ఘనంగా నిర్వహించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమం కోసం 2001లో కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించగా, 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. దేశవ్యాప్తంగా విస్తరించే ప్రణాళికతో 2022లో పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చారు. అయితే, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చేతిలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క స్థానంలోనూ గెలవలేకపోయింది.

# సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు.. అభినందించిన పవన్ కల్యాణ్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకున్న విషయం తెలిసిందే. ప్రముఖ ఆర్థిక దినపత్రిక 'ది ఎకనామిక్ టైమ్స్' ఆయనను 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ – 2025' అవార్డుతో సత్కరించింది. ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో నిన్న జరిగిన 26వ ఎకనామిక్ టైమ్స్ అవార్డ్స్ ఫర్ కార్పొరేట్ ఎక్సలెన్స్ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. పరిపాలనలో చేపట్టిన సంస్కరణలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడంలో చేసిన కృషికి గాను చంద్రబాబుకు ఈ గౌరవం దక్కింది. ముఖ్యంగా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', 'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్' వంటి విధానాలను అమలు చేయడం, స్వల్పకాలంలోనే రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి హామీలను ఆకర్షించడంలో చూపిన చొరవను ఎకనామిక్ టైమ్స్ జ్యూరీ ప్రత్యేకంగా ప్రశంసించింది. ఈ పురస్కారంపై ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. "చంద్రబాబు నాయకత్వ శైలి ఎంతో స్ఫూర్తినిస్తుంది. రాష్ట్రాభివృద్ధి కోసం ఆయన అమలు చేస్తున్న పాలనా విధానాలు, పారిశ్రామికవృద్ధికి చేపడుతున్న సంస్కరణలు కచ్చితంగా సత్ఫలితాలనిస్తాయి. ఆయనకు దక్కిన ఈ అవార్డు రాష్ట్రమంతటికీ గర్వ కారణంగా భావిస్తున్నాను," అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# పెట్రోల్, డీజిల్ కొరతతో బంకుల మూసివేత..

(మొదటి పేజీ తరువాయి)

సాధారణ రోజుల్లో రోజుకు 6,330 కిలోలీటర్ల పెట్రోల్, 9,048 కిలోలీటర్ల డీజిల్ అమ్మకాలు జరుగుతాయని, కానీ శనివారం ఒక్కరోజే 10,345 కిలోలీటర్ల పెట్రోల్, 14,156 కిలోలీటర్ల డీజిల్ విక్రయాలు జరిగినట్లు అధికారులు వివరించారు. సాధారణంతో పోలిస్తే డిమాండ్ ఒక్కసారిగా 50 శాతానికి పైగా పెరగడంతో, సరఫరా 10 శాతం పెంచినప్పటికీ బంకుల్లో నిల్వలు వేగంగా అయిపోతున్నాయని తెలిపారు. దీంతో అనేక బంకుల వద్ద వినియోగదారులు బారులు తీరుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆక్వా రంగంలో డ్రమ్ముల్లో ఇంధనం కొనుగోలు చేసేవారికి ఎదురవుతున్న సమస్యలను అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన చంద్రబాబు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు, మత్స్యశాఖ అధికారులు కలిసి ఒక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో ఇంధన కొరత నివారణకు తీసుకున్న చర్యలు, సమస్య పరిష్కారంపై సాయంత్రం లోగా తనకు నివేదిక సమర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సోమవారం నుంచి రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు కనిపించడానికి వీల్లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయిల్ కంపెనీలకు స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా ప్రజలను, ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తే కంపెనీల అనుమతులపై పునరాలోచన చేయాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరతపై ఆదివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజల నిత్యావసరాలైన పెట్రోల్, డీజిల్ సరఫరాలో బాధ్యతారహితంగా వ్యవహరిస్తే సహించేది లేదని సీఎం తేల్చి చెప్పారు. రిటైల్ ఔట్‌లెట్లకు క్రెడిట్ నిలిపివేసి, సరఫరా ఆపడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నయారా, రిలయన్స్ వంటి ప్రైవేట్ ఆపరేటర్లు సరఫరా నిలిపివేయడంతో సమస్య తీవ్రమైందని అధికారులు సీఎంకు వివరించారు. దీనికి తోడు వరికోతలు, అగ్రి, ఆక్వా రంగాల నుంచి డీజిల్‌కు డిమాండ్ పెరగడం కూడా కొరతకు కారణమైంది. మూడు రోజుల క్రితమే సమస్యను గుర్తించినా ఎందుకు తక్షణ చర్యలు తీసుకోలేదని కంపెనీల ప్రతినిధులను సీఎం ప్రశ్నించారు. నివేదికలు కాదు, ఫలితాలు



చూపించాలని ఆదేశించారు. ఈ సమస్యను తక్షణం చక్కదిద్దేందుకు ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్, కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బ్లాక్ మార్కెట్ అమ్మకాలు జరగకూడదని, రైతులకు ఇబ్బంది లేకుండా కూపన్ విధానంపై ఆలోచించాలని అధికారులకు సూచించారు. సరఫరాను వెంటనే సాధారణ స్థితికి తీసుకురావాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని చంద్రబాబు మరోసారి హెచ్చరించారు.

# ట్రంప్ విందులో కాల్పులు...

వాషింగ్టన్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కాల్పుల కలకలం రేగగా, మరోవైపు కొందరు చేసిన పని తీవ్ర వివాదాస్పదమైంది. ప్రాణభయంతో పరుగులు తీయాల్సిన సమయంలో, కొందరు టేబుళ్లపై ఉన్న ఖరీదైన వైన్ బాటిళ్లను చేతుల్లో పట్టుకుని బయటకు వెళ్లడం కెమెరాల్లో రికార్డయింది. ఈ వీడియోలు వైరల్ కావడంతో జర్నలిస్టుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం రాత్రి వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో ఈ వార్షిక విందు జరిగింది. దీనికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రథమ మహిళ, ఉన్నతాధికారులు, జర్నలిస్టులు, ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమం జరుగుతుండగా బాల్‌రూమ్ సమీపంలో ఒక్కసారిగా కాల్పుల శబ్దం వినిపించడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ట్రంప్ దంపతులను అక్కడి నుంచి సురక్షితంగా తరలించారు. అతిథులంతా భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ గందరగోళం మధ్యే కొందరు అతిథులు, టేబుళ్లపై ఉన్న వైన్, షాంపేన్ బాటిళ్లను తీసుకుని వెళ్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై నెటిజన్లు తీవ్రంగా మండిపడ్డారు. "విపత్తులో అవకాశాన్ని వెతుక్కున్నారు" అంటూ విమర్శలు గుప్పించారు. ఈ వివాదానికి 'వైన్–గేట్' అని పేరు పెట్టారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని కాలిఫోర్నియాకు చెందిన కోల్ థామస్ అలెన్ (31)గా పోలీసులు గుర్తించారు. అతని వద్ద షాట్‌గన్, హ్యాండ్‌గన్‌తో పాటు పలు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ట్రంప్ వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనలో సీక్రెట్ సర్వీస్ అధికారి ఒకరికి బుల్లెట్ తగిలినప్పటికీ, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ఉండడంతో అతనికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. నిందితుడిపై ఫెడరల్ చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







# ప్రజా'వాణి' వినాలి

(మొదటి పేజీ తరువాయి)

రావాల్సిన అవసరం లేకుండా ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని చెప్పారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుసటి రోజు 2023 డిసెంబర్ 8న మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. నాటి నుంచి ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణి నిర్వహిస్తున్నారు. అన్ని శాఖల అధికారులు అక్కడికక్కడే ప్రజల అర్జీలు, దరఖాస్తులను స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే చర్యలు చేపడుతున్నా రు. జిల్లా స్థాయిలోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతివారం ప్రజావాణి నిర్వహిస్తున్నారు.

### పైఅధికారికి ఫిర్యాదు ఆటో ఎస్కలేషన్..

ప్రతిస్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒకస్థాయిలో పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను అమలు చేయాలని చెప్పారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆలస్యమైతే అధికారులదే బాధ్యత అని చెప్పారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కింది స్థాయిలోనే కొన్ని పరిష్కరించే వీలుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు.

# బెంగాల్లో గూండారాజ్

(మొదటి పేజీ తరువాయి)

ఆశ్రయమిస్తోందని ఆరోపించారు. ఆదివారం ఉత్తర 24 పరగణాల జిల్లాలోని ఠాకూర్‌నగర్, హూగ్లీ జిల్లాలోని అరామ్‌బాగ్‌లో ఎన్నికల ప్రచార సభల్లో మోదీ మాట్లాడారు. "క్రూరమైన తృణమూల్ ప్రభుత్వం మహిళలను హింసించే గూండాలకు అండగా నిలుస్తోంది. ఈ అరాచకాలను ఇకపై సహించబోమని చెప్పాల్సిన సమయం వచ్చింది" అని అన్నారు. మహిళల భద్రతకు బీజేపీ కట్టుబడి ఉందని చెప్పారు. సందేశ్‌కాళీ బాధితురాలు రేఖా పాత్ర, ఆర్జీ కర్ బోధనాసుపత్రి బాధితురాలైన వైద్యురాలి తల్లి రత్న దేవనాథ్‌కు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్లిచ్చిందని ఆయన గుర్తు చేశారు. పొరుగు దేశాల్లో మత హింసను తట్టుకోలేక వలస వచ్చినవారికి సీఏఏ కింద భారత పౌరసత్వం కల్పిస్తామని పునరుద్ఘాటించారు. ఈ విషయంలో తృణమూల్ చెప్పే అబద్ధాలను నమ్మొద్దని ఆయన కోరారు. మహిళలపై అత్యాచారాలు, హింసకు పాల్పడే దుండగులను మే 4 తర్వాత రాబోయే బీజేపీ ప్రభుత్వం న్యాయస్థానం ముందు నిలబెడుతుందని మోదీ స్పష్టం




చేశారు. "బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఎప్పుడో ఖాయమైంది. రెండో దశ పోలింగ్ ఆ విజయాన్ని సుస్థిరం చేస్తుంది. తొలి దశలో 93 శాతానికి పైగా ఓటింగ్ నమోదు కావడంతో తృణమూల్ అహం దెబ్బతిన్నది. ఆ పార్టీ ఇప్పుడు 'మా, మాటీ, మానుష్' గురించి మాట్లాడడం మానేసింది. ఎందుకంటే వారి అరాచక పాలనలో మా (అమ్మ) కన్నీరు పెడుతోంది. మాటీ (భూమి)ని ముఠాలు, చొరబాటుదారులకు అప్పగించారు. మానుష్ (ప్రజలు) ఉద్యోగాలు, ఉపాధి కోసం వలస పోవాల్సిన దుస్థితి దాపురించింది" అని ఆక్షేపించారు. "మేం అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వ పథకాలన్నింటినీ బెంగాల్‌లో అమలు చేస్తామన్నారు. ఈ దిశగా తొలి కేబినెట్ భేటీలోనే నిర్ణయం తీసుకుంటాం" అని ప్రకటించారు.

### ఆలయాల్లో మోదీ పూజలు

ప్రధాని మోదీ బెంగాల్ ఠాకూర్ నగర్‌లో ఠాకూర్‌బారీ ఆలయంలో పూజలు చేశారు. కోల్‌కతాలో ప్రఖ్యాత థన్‌థానియా కాళీ ఆలయాన్నీ దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సమీపంలోని దుకాణంలో పూజా సామగ్రి కొనుగోలు చేశారు. అనంతరం ఉత్తర కోల్‌కతాలో భారీ రోడ్ షోలో పాల్గొన్నారు.

# సర్పంచ్ 'పతి'లదే రాజ్యం!

- రాజాపేట మండలంలో వింత పోకడ.. అధికారంలో ఉన్నా అబలలే!
- నిధుల నుంచి నిర్ణయాల వరకు భర్తలదే నిర్ణయాధికారం
- వక్రీకృతమవుతున్న రిజర్వేషన్ల లక్ష్యం
- స్వతంత్ర పాలన లేక కునారిల్లుతున్న మహిళా సాధికారత




**తొలివెలుగు, రాజాపేట:** గ్రామ పంచాయతీ పాలనలో మహిళలకు ప్రాధాన్యం కల్పించి వారిని సాధికారత దిశగా నడిపించాలన్న ప్రభుత్వ లక్ష్యం రాజాపేట మండలంలో క్షేత్రస్థాయిలో పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని 23 గ్రామపంచాయతీలలో 10 చోట్ల మహిళలు సర్పంచులుగా ఎన్నికైనా, వాస్తవ అధికారాలు మాత్రం వారి భర్తలు, కుటుంబ సభ్యుల చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పేరుకే మహిళలు సర్పంచులుగా ఉన్నా, గ్రామసభల నిర్వహణ, అభివృద్ధి పనులపై నిర్ణయాలు, నిధుల వినియోగం వంటి కీలక అంశాల్లో 'సర్పంచ్ పతి'లే ముందుండి వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రజల సమస్యలు వినడం నుంచి అధికారులతో చర్చించడం వరకు భర్తలే చక్రం తిప్పుతుండటంతో మహిళా నాయకత్వం కేవలం సంతకాలకే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో సర్పంచ్ భర్తల జోక్యం మరింత మితిమీరి, అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, తమకు నచ్చిన విధంగా నిధుల వినియోగంపై నిర్ణయాలు తీసుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని సమాచారం. ఈ ఆధిపత్యం కారణంగా నిజమైన మహిళా సాధికారతకు భంగం కలుగుతోందని సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేకపోవడం, పాలనాపరమైన అవగాహన లోపించడం, సామాజిక కట్టుబాట్లు వంటి కారణాలను ఆసరాగా చేసుకుని భర్తలు అధికారాన్ని వినియోగిస్తున్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొన్నిచోట్ల సర్పంచ్ భర్తల దౌర్జన్యాలపై ఎంపీఓలు, పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసినప్పటికీ సరైన చర్యలు తీసుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. అయితే, కొన్ని గ్రామాల్లో మహిళా సర్పంచులు ధైర్యంగా ముందుకు వచ్చి స్వతంత్రంగా పాలన సాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ఉదాహరణలు కూడా ఉన్నాయి. మహిళలకు కేటాయించిన రిజర్వేషన్లు కేవలం రికార్డులకే పరిమితం కాకుండా, వారు స్వయంప్రతిపత్తితో వ్యవహరించేలా అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక శిక్షణలు నిర్వహించాలని గ్రామస్తులు, నిపుణులు కోరుతున్నారు. మహిళలు స్వయంగా ముందుకు వచ్చి తమ అధికారాలను వినియోగించినప్పుడే నిజమైన గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని అధికారులు సూచిస్తున్నారు.



## సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

- వాసవి మాత జయంతి గుర్తింపుపై ఆర్యవైశ్యుల హర్షం

**తొలివెలుగు, జన్నారం:** వాసవి మాత జయంతిని రాష్ట్ర ప్రభుత్వ పండుగల జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడం పట్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం జన్నారం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు చిత్రపటాలకు వారు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకురాలు జక్కు సుష్మ, ఇతర ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ ఆరాధ్య దైవమైన వాసవి మాత జయంతిని అధికారికంగా రాష్ట్ర పండుగగా గుర్తించాలని దశాబ్దాలుగా కోరుతున్నామన్నారు. ఆర్యవైశ్యుల మనోభావాలను గుర్తించి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేట అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు గ్రామ పాలకవర్గం వినతి
- సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ విప్




**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని బేగంపేట గ్రామ సర్వతోముఖాభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని కోరుతూ ఆదివారం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు గ్రామ పాలకవర్గం వినతిపత్రం అందజేసింది. సర్పంచ్ అనూష సుమన్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో అభివృద్ధి పనులు ముందుకు సాగాలంటే నిధుల ఆవశ్యకత ఎంతో ఉందని సర్పంచ్ ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు. సుమారు 70 ఏళ్ల క్రితం నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, నూతన భవన నిర్మాణం చేపట్టాల్సి ఉందని కోరారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో కనీస వసతులు లేక చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొత్త భవనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) వ్యవస్థను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించుకునేందుకు, అధికారులతో సమీక్షలు జరిపేందుకు సరైన వేదిక లేక ఇబ్బందిగా మారిందని, వెంటనే ఒక 'మహిళా భవన్' నిర్మించేలా నిధులు కేటాయించాలని సర్పంచ్ అనూష సుమన్ కోరారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బేగంపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.. గ్రామ అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచ్ అనూష సుమన్, ఉపసర్పంచ్ బద్ద మధుసూదన్ రెడ్డిలను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు.

## యాదద్రి క్షేత్రంలో ఇంటలిజెన్స్ డీజీ

- కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు.. వేద పండితుల ఆశీర్వచనం

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని రాష్ట్ర ఇంటలిజెన్స్ డీజీ అనిల్ కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకున్న అనంతరం అనిల్ కుమార్ దంపతులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ముఖ మండపంలో అర్చకులు ఆయనకు వేద మంత్రోచ్ఛారణలతో ఘనంగా ఆశీర్వచనం గావించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేందర్ రెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



## బసంతపురంలో వైభవంగా 'బంగారు మైసమ్మ' పండుగ





- పాల్గొన్న సర్పంచ్ రత్నమాల, గ్రామ పాలకవర్గం
- పూర్తి ఖర్చుతో ఆలయాన్ని నిర్మించిన ఎం.బి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ రెడ్డి

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని బసంతపురం గ్రామంలో రజక కులస్తుల ఆరాధ్య దైవం బంగారు మైసమ్మ తల్లి పండుగ ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ సర్పంచ్ మెండు రత్నమాల – సత్తిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి ఎం.బి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెండు భాస్కర్ రెడ్డి పూర్తి ఖర్చును భరించి, భవ్యమైన ఆలయాన్ని నిర్మించడం విశేషం. ఈ వేడుకల్లో ఉపసర్పంచ్ గుళ్ళపల్లి రాజు గౌడ్, వార్డు సభ్యులు మాధవి సురేష్, కవిత బాలకృష్ణ, ముల్కలపల్లి రమేష్, మెండు ఉపేందర్ రెడ్డి, రాములమ్మ రామకోటి తదితరులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించు కున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సామూహిక భోజనాల్లో గ్రామస్థులు, రజక కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి ఉదారంగా నిధులు వెచ్చించిన దాత మెండు భాస్కర్ రెడ్డికి రజక కుల పెద్దలు, గ్రామస్థులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు.



## నిక్కచ్చిగా.. జనగణన

- గృహాల గణనలో తప్పులకు తావుండొద్దు
- అదనపు కలెక్టర్ భాస్కరరావు

**తొలివెలుగు, బీబీ :** రాబోయే 'జనగణన 2027' ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం బీబీనగర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్ల రెండో విడత శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనగణన అనేది దేశ భవిష్యత్తు ప్రణాళికలకు దిక్సూచి వంటిదని, ఇందులో ప్రతి ఒక్కరి వివరాలు ఖచ్చితంగా నమోదవ్వాలని స్పష్టం చేశారు. గృహాల గణన చేపట్టే సమయంలో ఎన్యుమరేటర్లు పూర్తి అవగాహనతో వ్యవహరించాలని, ఎక్కడా పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సేకరించే సమాచారం వాస్తవ రూపంలో ఉండాలని, ప్రతి అధికారి తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని కోరారు. శిక్షణను నాణ్యంగా నిర్వహించి, ఎన్యుమరేటర్లకు ఉన్న సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్, మండల విద్యాధికారి (ఎంఈవో), సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.






## భక్తిశ్రద్ధలతో వాసవి అమ్మవారి జయంతి

- రఘునాథపురం, గుట్టలో ఘనంగా వేడుకలు
- పంచామృతాభిషేకాలు, విశేష పూజలు

**తొలివెలుగు, రాజాపేట/యాదగిరిగుట్ట:** ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఆదివారం మండలంలోని రఘునాథపురం, యాదగిరిగుట్ట పట్టణంలోని లోటస్ టెంపుల్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారి మూర్తులకు అర్చకులు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి మంగళ హారతులు ఇచ్చారు. ఆలయ గౌరవ అధ్యక్షులు పొద్దుటూరి నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అధ్యక్షులు బెజగం వెంకట నరసయ్య-సువర్ణ పుణ్యదంపతులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాసవి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వేడుకల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి, అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



## లోటస్ టెంపుల్‌లో విజయలక్ష్మి జన్మదిన వేడుకలు

- పాల్గొన్న ఐవీఎఫ్ ధార్మిక పరిషత్ రాష్ట్ర చైర్మన్ అంజయ్య స్వామి
- వాసవి అమ్మవారి సమక్షంలో అన్న ప్రసాద వితరణ

**తొలివెలుగు, రాజాపేట/యాదగిరిగుట్ట :** ఐవీఎఫ్ ధార్మిక పరిషత్ రాష్ట్ర చైర్మన్ వంగపల్లి అంజయ్య స్వామి సతీమణి విజయలక్ష్మి 55వ జన్మదిన వేడుకలు ఆదివారం యాదగిరిగుట్టలోని లోటస్ టెంపుల్‌లో ఘనంగా జరిగాయి. శ్రీ వాసవి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని అంజయ్య స్వామి - విజయలక్ష్మి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన జన్మదినం సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో లోటస్ టెంపుల్ అధ్యక్షులు బెజగం వెంకట నరసయ్య - సువర్ణ, ఉపాధ్యక్షులు శివకుమార్ - చంద్రకళ, ప్రధాన కార్యదర్శి ఉప్పల రమేష్ - స్వప్న దంపతులు పాల్గొని విజయలక్ష్మికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణంలోని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు ఈ వేడుకల్లో పాల్గొని అభినందనలు తెలిపారు.

## చల్లూరులో 'దుర్గమ్మ' పండుగ సందడి.. తేదీలు ఖరారు

- మే 30న కనకదుర్గమ్మ బోనాలు
- చల్లూరు గ్రామ పెద్దల సమావేశంలో నిర్ణయం
- 31న సామూహిక వనభోజనాలు




**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని చల్లూరు గ్రామ దేవత శ్రీ కనకదుర్గమ్మ తల్లి పండుగ నిర్వహణకు ముహూర్తం ఖరారైంది. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి భీమగాని రూప - బాలనరసయ్య గౌడ్ అధ్యక్షతన గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అందరి అభిప్రాయాలను సేకరించిన అనంతరం మే నెల చివరి వారంలో పండుగ నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. మే 30వ తేదీ శనివారం రాత్రి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించాలని, మరుసటి రోజు మే 31 ఆదివారం గ్రామస్థులందరి ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. గ్రామస్థులందరూ ఐక్యమత్యంతో పండుగను విజయవంతం చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సర్పంచి కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొంత సుధాకర్, వార్డు సభ్యులు, కుల పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## కన్నీరు తుడుస్తూ.. అండగా నిలుస్తూ!

- వడదెబ్బతో మృతి చెందిన దేవదాసు కుటుంబానికి సాయం
- మానవత్వాన్ని చాటుకున్న పాముకుంట గ్రామస్తులు



**తొలివెలుగు, రాజాపేట:** ఎండల తీవ్రతకు ప్రాణాలు కోల్పోయి పెద్దదిక్కును కోల్పోయిన ఓ నిరుపేద కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచి ఆదర్శంగా నిలిచారు. రాజాపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన లింగాల దేవదాసు కొద్దిరోజుల క్రితం తీవ్రమైన వడదెబ్బకు గురై మృతి చెందిన విషయం విదితమే. దేవదాసు అకాల మరణంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో కూరుకుపోవడమే కాకుండా, ఆర్థికంగా ఇబ్బందుల పాలైంది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలనే సదుద్దేశంతో పాముకుంట గ్రామస్తులు, యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. గ్రామస్తులందరూ తలా ఒక చేయి వేసి విరాళాలు సేకరించారు. ఆలా పోగైన రూ.16,000 నగదును ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపద సమయంలో తోటివాడికి సాయం చేయడమే నిజమైన మానవత్వమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాముకుంట గ్రామ వార్డు సభ్యులు రంగ నరేష్, బచ్చలి శేఖర్, సామాజికవేత్త గొడుగు బాలరాజు, గ్రామ యువకులు కాకల నవీన్ కుమార్, వెంకటాపురం అశోక్, పట్నం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ప్రగతికి పెద్దపీట

- బొడ్మట్ పల్లిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనుల ప్రారంభం
- మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యమన్న తలారి అవినాష్ కుమార్



**తొలివెలుగు, టేక్మాల్:** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ, పల్లెలను ప్రగతి పథంలో నడిపించేందుకు విస్తృత స్థాయిలో చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర సర్పంచుల ఫోరం కార్యదర్శి తలారి అవినాష్ కుమార్ తెలిపారు. టేక్మాల్ మండలం బొడ్మట్ పల్లి గ్రామంలో రూ.5 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నిధులు వెచ్చిస్తున్నట్లు ఈ సందర్భంగా అవినాష్ కుమార్ వివరించారు. గ్రామాల్లో మట్టి రోడ్ల కారణంగా వర్షాకాలంలో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఉప్పు శంకరప్ప, పంచాయతీ కార్యదర్శి మౌనిక, స్థానిక నాయకులు నాగభూషణం, రవిశంకర్, నర్సింలు, విఠల్, యువజన కాంగ్రెస్ నాయకులు మహేష్ రెడ్డి, ఈశ్వరప్పలతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వైభవంగా నారసింహుడి జయంతి ఉత్సవాల ఆరంభం






- యాదాద్రిలో ఐదు రోజుల పాటు పాంచాహ్నిక దీక్ష
- విశ్వక్సేన ఆరాధన, అగ్ని మధనంతో హోమ క్రతువు ప్రారంభం

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** తెలంగాణలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో స్వామివారి జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు ఐదు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పమాలికలతో, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. విద్యుత్ కాంతుల్లో ఆలయం ప్రకాశవంతంగా దర్శనమిచ్చింది. విశ్వక్సేన పూజతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, పట్టు వస్త్రాలు ధరింపజేసి ప్రత్యేక పీఠంపై అధిష్ఠింప చేశారు. అనంతరం విశ్వక్సేన ఆరాధన చేసి, సత్యం - జ్ఞానం - ధర్మం అనే మూడు కలశాలను ఏర్పాటు చేసి గంగాజలంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ పవిత్ర జలంతో ధ్వజస్తంభం, బలిపీఠం, యాగశాల, రథశాల, ప్రసాద విక్రయశాల తదితర ప్రాంతాలను సంప్రోక్షణ చేసి శుద్ధి చేశారు. అలాగే స్వామి, అమ్మవార్లకు రక్షాబంధనం నిర్వహించి ఐదు రోజుల దీక్షను ప్రారంభించారు. తదుపరి ఆలయ అర్చకులు స్వామివారికి కుంకుమార్చన నిర్వహించారు. సహస్రనామార్చనతో భక్తి శ్రద్ధల మధ్య కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో భవానీ శంకర్, చైర్మన్ నరసింహమూర్తి కూడా కుంకుమార్చనలో పాల్గొన్నారు.

**యాగశాలలో అగ్ని ప్రతిష్ట:**

ఆలయంలో పూజా కార్యక్రమాలు పూర్తైన అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా యాగశాలకు తీసుకువచ్చారు. పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించే పంచకుండాత్మక హోమంలో భాగంగా మొదటి రోజు అగ్ని ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. అగ్ని మధనం చేసి సుదర్శన, నారసింహ, లక్ష్మీ దేవతల మూలమంత్రాలతో హోమం నిర్వహించారు. అనంతరం లఘు పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యులు, శ్రీధర్ ఆచార్యులు, మంగళగిరి నరసింహమూర్తి, రాకేష్ ఆచార్యులు, శ్రీనాథ ఆచార్యులు, డీఈఓ నవీన్ కుమార్, ఏఈఓ శంకర్ నాయక్, సూపరింటెండెంట్ సురేందర్ రెడ్డి, అర్జున్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల ప్రారంభ రోజున నిర్వహించిన పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాబోయే రోజుల్లో కూడా వివిధ ధార్మిక కార్యక్రమాలు వైభవంగా కొనసాగనున్నాయి.







## భక్తిశ్రద్ధలతో కాటమహేశ్వరుని కళ్యాణం

- వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


**తొలివెలుగు, రామన్నపేట:** మండలంలోని సిరిపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ సురమాంబ సమేత కాటమహేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన విశేష పూజా కార్యక్రమాలకు నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, స్థానిక సర్పంచ్ అంబటి ఉపేంద్రమ్మ రవీందర్ రెడ్డి, ఇంద్రపాల్ నగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్, మాజీ ఎంపీటీసీ పున్న వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, సిరిపురం సర్పంచ్ అంబటి ఉపేంద్రమ్మ, రవీందర్ రెడ్డి, ఇంద్రపాల్ నగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్, మాజీ ఎంపీటీసీ పున్న వెంకటేశం, గ్రామ శాఖ అధ్యక్షుడు బండ శ్రీనివాస్ రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కూనూరు ముత్తయ్య, వార్డు సభ్యులు కట్ట సతీష్ రెడ్డి, గాదె శంకర్, కూనూరు రమేష్, నాయకులు కూనూరు లింగస్వామి, గాదె రామచంద్రం, స్వామి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రింటింగ్ రంగంలోకి 'శ్రీ కళా'..

- ఘనంగా 'శ్రీ కళా ఫ్లెక్సీ ప్రింటింగ్' ప్రారంభోత్సవం
- ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ 13వ వార్డు పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 'శ్రీ కళా ఫ్లెక్సీ ప్రింటింగ్' షాపును ఆదివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపు యజమాన్యానికి శుభాకాంక్షలు తెలుపుతూ.. స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు నాణ్యమైన సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఢిల్లీ చంద్రకళ, యువజన కాంగ్రెస్ నాయకులు చింతకింది గణేష్ గౌడ్, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



## పట్టు వస్త్రాలంకరణ వేడుకలో చిరుమర్తి

- వెల్లంకిలో చిన్నారులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో జరిగిన నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకలో నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య పాల్గొని సందడి చేశారు. గ్రామానికి చెందిన నన్నూరి రవీందర్ రెడ్డి కుమారుల పట్టు వస్త్రాలంకరణ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు నూతన వస్త్రాలను అందజేసి, వారిని ఆశీర్వదించారు. అనంతరం రవీందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు, సర్పంచ్ ఈడం రాధా శ్రీనివాస్, గర్దాస్ విక్రమ్, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి, జిల్లా నాయకుడు ఎస్.కె. చాంద్, గ్రామ కార్యదర్శి పిట్ట మహేందర్ రెడ్డి, నాయకులు ఎడ్ల నరేందర్ రెడ్డి, ఎడ్ల కృష్ణారెడ్డి, పాశం సతీష్ రెడ్డి, బొలుగుల కృష్ణ, బొడ్డుపల్లి రాజు, వర్కల రమేష్, కొమ్ము రాము తదితరులు పాల్గొన్నారు.

## పదవి అడిగితే సస్పెన్షనా?

- కాంగ్రెస్‌కు బండారు ప్రకాష్ రెడ్డి రాజీనామా



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** పార్టీ కోసం దశాబ్ద కాలంగా కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని పట్టణ కాంగ్రెస్ నాయకుడు బండారు ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం పోచంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో కో-ఆప్షన్ పదవి కోసం తాను దరఖాస్తు చేసుకున్నానని, అయితే కొందరు కావాలనే కుట్రపూరితంగా వ్యవహరించి తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. పదేళ్లుగా ఎమ్మెల్యే, ఎంపీ, స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అహర్నిశలు శ్రమించానని గుర్తు చేశారు. నామినేషన్ ఉపసంహరించుకున్న తర్వాత కూడా తనపై సస్పెన్షన్ వేటు వేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. తనను సస్పెండ్ చేయడం ఏమిటని, తానే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.



# ప్రభుత్వ లాంఛనాలతో వాసవీ మాత జయంతి

- కలెక్టరేట్‌లో ఘనంగా వేడుకలు
- జ్యోతి ప్రజ్వలన చేసిన అదనపు కలెక్టర్ భాస్కరరావు



**తొలివెలుగు, భువనగిరి:** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆదివారం వాసవీ మాత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వైశాఖ శుక్ల పక్ష దశమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘాల విన్నపం మేరకు వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వాసవి దేవాలయాలు, సత్రాల్లో ప్రభుత్వ లాంఛనాలతో వేడుకలు జరుగుతున్నాయని వివరించారు. జిల్లా యువజన, క్రీడల అధికారి ధనంజనేయులు మాట్లాడుతూ.. ప్రతి ఏటా వైశాఖ శుక్ల పక్ష దశమిని వాసవీ మాత జయంతిగా నిర్వహిస్తామని, ప్రభుత్వం దీనిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం పట్ల ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వాసవి సంఘం జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, రీజినల్ సెక్రటరీ ఎ.రమేష్, సెక్రటరీ హనుమంతరావు, మహేష్, మనోహర్, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, శ్రీనివాస్, సోమన్న, రాజేందర్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడితే వేటు

- బండారు ప్రకాష్ రెడ్డి సస్పెన్షన్
- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి, వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక టై అండ్ డై ఫంక్షన్ హాల్లో నిర్వహించిన పట్టణ, మండల ముఖ్య నాయకుల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ముక్తాపూర్ గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు బండారు ప్రకాష్ రెడ్డి పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నందున, పెద్దల సమక్షంలో చర్చించి అతడిని పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. కార్యకర్తలు, నాయకులు పార్టీ నియమావళికి లోబడి పనిచేయాలని, క్రమశిక్షణ తప్పితే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, గునిగంటి రమేష్ గౌడ్, కౌన్సిలర్ రావుల జంగయ్య, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- గౌస్‌కొండలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- 48 గంటల్లోనే నగదు జమ: సర్పంచ్ నరేష్ గౌడ్

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** అన్నదాతల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గౌస్‌కొండ సర్పంచ్ మునుకుంట్ల నరేష్ గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని గౌస్‌కొండ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేలా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాకిటి బాల్రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుక్క దానే, రైతు నాయకులు మర్రి పాండురెడ్డి, వాకిటి నారాయణరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లింగాల శంకర్, మర్రి మల్లారెడ్డి, దోసపాటి అంజయ్య, రవి, గోవర్ధన్ రెడ్డి, శంకర్, శ్రీశైలం, వెంకటేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



# తప్పుడు సమాచారంతో పెళ్లి సంబంధం

- భారీగా కట్నకానుకలు తీసుకుని మోసం
- పెళ్లికొడుకు ఇంటిపై దాడి
- వరకట్న నిషేధ చట్టం కింద కేసు
- ఇరువర్గాలపై కేసులు నమోదు




బంజారాహిల్స్, ఏప్రిల్ 26: 'ఉద్యోగం విషయంలో అబద్ధం చెప్పి భారీగా కట్నకానుకలు తీసుకొని,. ఎంగేజ్‌మెంట్ కోసం భారీగా ఖర్చుపెట్టిన తర్వాత పెళ్లి రద్దు చేసుకున్నారు..' అంటూ పెళ్లి కుమార్తె తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పెళ్లికొడుకుతో పాటు కుటుంబసభ్యులపై కేసు నమోదైంది. మరోవైపు తమ ఇంటిమీదకు వచ్చి దాడికి పాల్పడ్డారంటూ పెళ్లికొడుకు తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పెళ్లి కుమార్తె తల్లితోపాటు మరికొంతమందిపై మరో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. రాజేంద్రనగర్‌లోని గ్రీన్ వాక్‌వేస్ విల్లాస్‌లో నివాసం ఉంటు న్న టీడీపీ నేత, నోవా మెడికల్ కళాశాలల చైర్మన్ ముత్తంశెట్టి కృష్ణారావు, డా.విజయనిర్మల కుమార్తెతో జూబ్లీహి ల్స్ రోడ్ నెం.10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో ని వాసం ఉంటున్న దివీస్ ఫార్మా కంపెనీ ఉద్యోగి పెండ్యా ల సాయి అక్షయ్‌కుమార్‌కు పెండ్లి సంబంధం కుదిరింది.తమ కుమారుడు దివీస్ ఫార్మా సంస్థలో ఉన్నత స్థా యిలో ఉద్యోగం చేస్తున్నాడని, త్వరలో మరింత పెద్దస్థాయిలోకి వెళ్లనున్నాడని పెండ్యాల సుధాకర్, అతడి భా ర్య ఉషా పెండ్యాల తదితరులు నమ్మబలకడంతో రూ. 1కోటి వరకట్నంతోపాటు ఖరీదైన బహుమతులు, బీఎండబ్ల్యూ కారు, ఖరీదైన వాచీ ఇచ్చారు. కాగా ఎంగేజ్‌మెం ట్ అయిన కొన్ని రోజులకే రెండు కుటుంబాల మధ్య వివాదాలు ప్రారంభమయ్యాయి. పెళ్లికొడుకు ఉద్యోగం విషయంలో అబద్ధాలు చెప్పారని, వరకట్నం అవసరం లేదని ముందు చెప్పి భారీగా కట్నకానుకలు డిమాండ్ చేస్తున్నారని పెళ్లికుమార్తె కుటుంబసభ్యులు ఆరోపించా రు. దీంతో పెళ్లి రద్దు చేసుకుంటున్నామని పెండ్యాల సుధాకర్ తెలిపారు. తాము ఇచ్చిన కట్న కానుకలు, ఎం గేజ్‌మెంట్ కోసం పెట్టిన ఖర్చును వెనక్కి ఇవ్వాలని కోర గా డబ్బులు వెనక్కి ఇవ్వకపోవడంతో పాటు తమ కుటు ంబంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ రెండ్రోజుల క్రితం నోవా మెడికల్ కాలేజ్ చైర్ పర్సన్ డా.విజయనిర్మలతో పాటు సుమారు 70మంది వ్యక్తులు జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలోని పెండ్యా ల సుధాకర్ ఇంటివద్దకు వచ్చారు.వాచ్‌మెన్‌ను తోసేయడంతో పాటు గేట్లు విరగ్గొట్టి లోనికి ప్రవేశించారు. ఫర్నిచర్, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. పెండ్యాల సుధాకర్ కుటుంబసభ్యులను చంపేస్తామంటూ వార్నిం గ్ ఇచ్చారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ మేరకు సుధాకర్ డయల్ 100కు ఫోన్ చేయగా జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను శాం తింపజేశారు. తమ ఇంటిమీదకు వచ్చి దాడికి పాల్పడ్డ డా.విజయనిర్మలతో పాటు ఆమె అనుచరులపై చర్యలు తీసుకోవాలంటూ పెండ్యాల సుధాకర్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాగా తప్పుడు సమాచారంతో పెళ్లి సంబంధం కుదుర్చుకోవడమే కాకుండా భారీగా వరకట్నం డిమాండ్ చేసి, ఎంగేజ్‌మెంట్ చేసుకున్న తర్వాత పెళ్లి రద్దు చేసుకోవడంతో తమ కుమార్తె తీవ్ర డిప్రెషన్‌కు గురైందని, దీనికి బాధ్యులైన పెండ్యాల సాయి అక్షయ్, అతడి తండ్రి పెండ్యాల సుధాకర్, తల్లి పెండ్యాల ఉష, సోదరి క్రితి పెండ్యాలపై చర్యలు తీసుకోవాలని పెళ్లి కుమార్తె తల్లి డా.విజయనిర్మల జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వరకట్న నిషేధ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# మళ్లీ చిన్నపిల్లలయ్యారు.. మధుర జ్ఞాపకాల్లో తేలారు!

- సర్వేల్ జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక
- ఉపాధ్యాయులకు ఘన సత్కారం

**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపురం:** పాఠశాల జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ, గురువుల ఆశీస్సులు పొందుతూ సంస్థాన్ నారాయణపురం మండలంలోని సర్వేల్ జడ్పీహెచ్ఎస్ 2010-11 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకున్నారు. ఆదివారం స్థానిక బి.జె.ఆర్ ఫంక్షన్ హాల్లో ఈ సమ్మేళనం సందడిగా సాగింది. సుమారు 15 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంలో మునిగిపోయారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరైన ప్రధానోపాధ్యాయుడు దామోదర్ రెడ్డి, ఉపాధ్యాయులు నాగమ్మ, నాగభూషన్, అన్నపూర్ణ, సుజాత, యాదగిరిలను విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తమ వద్ద చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడటం గర్వకారణమని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కట్టెల ఆనంద్, సూర్వి రాజేష్, యముడాలా లింగస్వామి, సురేష్, వంశీ తేజ, శివారెడ్డి, మహేష్, సమీరా, కవిత, అశ్విని సహా సుమారు 60 మంది పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వాసవీ మాత జయంతి

- చౌటుప్పల్ రామాలయంలో విశేష పూజలు
- హాజరైన మున్సిపల్ ఛైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి జయంతిని పురస్కరించుకుని చౌటుప్పల్ పట్టణంలోని రామాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త మంచికంటి భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.అహింసా పరమోధర్మః అనే నినాదంతో లోక కల్యాణానికి కృషి చేసిన వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించుకోవడం సంతోషదాయకమని వారు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో సోమవారం సత్తయ్య, కామిశెట్టి చంద్రశేఖర్, పాలడుగు వెంకటేష్, నాంపల్లి శ్రీను, తడకమల్ల శ్రీను, దాచేపల్లి శ్రీను, నీల రమేష్, ఉప్పల కృష్ణ, వీరమల్ల సూర్యనారాయణ, సతీష్ కుమార్, సముద్రాల సత్యనారాయణ, దాచేపల్లి లక్ష్మి, మంచికంటి ప్రమీల, కామిశెట్టి శ్రీదేవి, పాలడుగు వందన, నాంపల్లి అమృత, తడకమల్ల సుష్మ, దాచేపల్లి రమాదేవి, గోరంటి సంధ్య, సోమవారం వెంకటమ్మ, సముద్రాల వాణి, సింగిడికొండ శైలజ, నాంపల్లి సంగీత, గట్టుఉప్పల కుసుమ, దీపిక, యమున, రమాదేవి, పుష్పమ్మ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనత పార్టీ దళిత మోర్చామండల కార్యవర్గ సమావేశం



దళిత మోర్చా మండల అధ్యక్షులు గుండెపోగు క్రాంతి

నేలకొండపల్లి మండలం కొత్త కొత్తూరు లో

జరిగిన ఈ సమావేశానికి ముఖ్యం అతిథిగా బీజేపీనేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ హాజరుకావటం జరిగింది ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతుభూమి లేని దళితులకు 3 ఎకరాల భూమి ఇవ్వాలనిఅదేవిదంగా బ్యాంక్ తో సంబంధం లేకుండా రాజ కార్పొరేషన్ద్వారా నిరుపేద దళితులకు 5 లక్షలు ఋణం ఇవ్వాలనిప్రభుత్వం ని కోరారు, నిరుపేద ఇల్లు లేని దళితులకు ఇళ్లస్థలం కేటాయించి ప్రభుత్వం ఇల్లు కేటాయించాలి దళితులసమస్యలు తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వం ని డిమాండ్చేశారు. ఈ సమావేశంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శిమల్లెబోయిన గోవిందరావు, దళిత మోర్చా జిల్లా మాజీఅధ్యక్షులు సూరేపల్లి జ్ఞానరత్నం, కొదమగుండ స్వామి దాసు,టీ సతీష్, కే నాగరాజు, ం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలందరికీ సొంత ఇంటి కల నెరవేరుస్తాం

- 13వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం
- మున్సిపల్ ఛైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చౌటుప్పల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోదుగుల పావని రమేష్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో వున్న యాదమ్మ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోర్పునూరు నరసింహ గౌడ్, తోర్పునూరు రమేష్ (రవి గౌడ్), యువజన కాంగ్రెస్ నాయకులు చింతకింది గణేష్ గౌడ్, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





## సరికొత్త ప్రపంచ రికార్డు

లండన్: ప్రతిష్టాత్మక లండన్ మారథాన్ రేసులో కెన్యా అథ్లెట్ సెబాస్టియన్ సావీ అద్భుతం చేశాడు. నిర్ణీత 42.195 కిలోమీటర్ల దూరాన్ని 1 గంట 59 నిమిషాల 30 సెకన్లలో పూర్తి చేసి కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. అంతేకాకుండా మారథాన్ రేసును 2 గంటల్లోపు ముగించిన తొలి అథ్లెట్‌గా సెబాస్టియన్ గుర్తింపు పొందాడు. ఇదే రేసులో రెండో స్థానంలో నిలిచిన యోమిఫ్ కెజెల్చా (ఇథియోపియా) 1 గంట 59 నిమిషాల 41 సెకన్లలో గమ్యానికి చేరాడు. తద్వారా 2 గంటల్లో మారథాన్ పూర్తి చేసిన రెండో అథ్లెట్‌గా నిలిచాడు. జేకబ్ కిప్లిమో (ఉగాండా) 2 గంటల 28 సెకన్లలో రేసును ముగించి మూడో స్థానంలో నిలిచాడు. సెబాస్టియన్, కెజెల్చా, కిప్లియో ఒకేరోజు ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడం విశేషం. 2023 నుంచి కెల్విన్ కిప్టుమ్ పేరిట ఉన్న మారథాన్ ప్రపంచ రికార్డును (2 గంటల 35 సెకన్లు; చికాగో మారథాన్) ఆదివారం ఈ ముగ్గురూ సవరించారు.

## అగ్రస్థానంతో ముగింపు



కైరో: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్‌లో భారత జట్టు అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో చివరిరోజు భారత షూటర్లు ఒక రజతం, ఒక కాంస్యంతో కలిపి రెండు పతకాలు సాధించారు. ఓవరాల్‌గా భారత షూటర్లు 5 స్వర్ణాలు, 6 రజతాలు, 5 కాంస్యాలతో కలిపి మొత్తం 16 పతకాలు సొంతం చేసుకొని 'టాప్' ర్యాంక్‌ను అందుకున్నారు. ఆఖరి రోజు పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో హేమంత్ బర్మన్ రజత పతకాన్ని నెగ్గాడు. హేమంత్ 351.7 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచాడు. భారత్‌కే చెందిన వేదాంత్ నితిన్ వాఘ్మరే, రోహిత్ కన్యాన్ కూడా ఫైనల్లో పోటీపడినా పతకాలు సాధించలేకపోయారు. రోహిత్ 311.9 పాయింట్లతో ఆరో స్థానంలో, నితిన్ 300.5 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచారు. ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జుహైర్ ఖాన్‌ఆద్యా కత్యాల్ జోడీ భారత్‌కు కాంస్య పతకాన్ని అందించింది. జుహూర్‌ఆద్యా ద్వయం 19 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత షూటర్లు తేజల్, యుగేశ్వరి, అనుష్క, ఖ్వాయిష్ శర్మ ఫైనల్ చేరుకోవడంలో విఫలమయ్యారు.

## చరిత్ర సృష్టించిన సంజూ శాంసన్.. ఫాస్టెస్ట్ ఇండియన్‌గా



ఐపీఎల్-2026లో చెపాక్ మైదానం వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ నిరాశపరిచాడు. గత మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన శాంసన్.. గుజరాత్‌పై మాత్రం తన మార్క్‌ను చూపించలేకపోయాడు. 15 బంతుల్లో 11 పరుగులు చేసి సంజూ ఔటయ్యాడు. అయితే ఈ మ్యాచ్‌లో శాంసన్ విఫలమైనప్పటికి ఓ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఐపీఎల్‌లో బంతుల పరంగా అత్యంత వేగంగా 5000 పరుగులు మైలు రాయిని అందుకున్న భారత ఆటగాడి శాంసన్ రికార్డు సృష్టించాడు. సంజూ కేవలం 3555 బంతుల్లో ఈ ఫీట్‌ను అందుకున్నాడు.ఇంతకుముందు ఈ రికార్డు సీఎస్‌కే లెజెండ్ సురేష్ రైనా పేరిట ఉండేది. రైనా 3620 బంతుల్లో ఈ ఘనత అందుకున్నాడు. ఓవరాల్‌గా ఈ జాబితాలో దిగ్గజాలు ఏబీ డివిలియర్స్ (3288 బంతులు), డేవిడ్ వార్నర్ (3554 బంతులు) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. ఇక ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. సీఎస్‌కేపై 6 వికెట్ల తేడాతో గుజరాత్ ఘన విజయం సాధించింది. 159 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ 16.4 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి చేధించింది. ఓపెనర్ సాయిసుదర్శన్(46 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్స్‌లతో 87) మరోసారి అదరగొట్టాడు.

# ఫలితాలు, ఫెడ్‌పైనే ఫోకస్



అటు హోర్ముజ్‌పై వివాదాలు, ఇటు ముడిచమురు ధరలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. అయితే యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ పాలసీ నిర్ణయాలు, దేశీ కార్పొరేట్ క్యూ4 ఫలితాలకు ఇన్వెస్టర్లు అత్యధిక ప్రాధాన్యత వచ్చే వీలుంది. వెరసి ఈ వారం సైతం తీవ్ర ఆటుపోట్లకు అవకాశమున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. వివరాలు చూద్దాం.. పశ్చిమాసియాలో నెలకొన్న ఆందోళనకర పరిస్థితులు దేశీయంగా సెంటిమెంటును ప్రభావితం చేయనున్నాయి. మరోపక్క ఇప్పటికే జోరందుకున్న జనవరిమార్చి(క్యూ4) ఫలితాల సీజన్ మరింత వేడెక్కనుంది. అంతేకాకుండా ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లకు దిక్సూచిగా నిలిచే ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) పాలసీ సమీక్ష నిర్ణయాలు కీలకంగా నిలవనున్నాయి. వెరసి పలు అంశాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌ను నిర్దేశించనున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం(మే 1) స్టాక్, కమోడిటీ, కరెన్సీ మార్కెట్లకు సెలవుకావడంతో ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితంకానుంది. గత వారాంతాన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇండస్‌ఇండ్, యాక్సిస్ బ్యాంక్, హిందుస్తాన్ జింక్ తదితరాలు క్యూ4 ఫలితాలు ప్రకటించాయి. ఈ బాటలో అల్ట్రాటెక్ సిమెంట్, కోల్ ఇండియా, వరుణ్ బెవరేజెస్, ఏయూ స్మాల్‌బ్యాంక్, ఎస్‌బీఐ కార్డ్స్, అదానీ టోటల్, మారుతీ సుజుకీ, ఎటర్నల్, గార్డెన్‌రీచ్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పవర్, ఇండియన్ బ్యాంక్, వారీ ఎనర్జీస్, ఫెడరల్ బ్యాంక్, హిందుస్తాన్ యూనిలీవర్, అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, బజాజ్ ఫిన్‌సర్వ్, చోళమండలం తదితరాల పనితీరు వెల్లడికానుంది. మార్చి నెలకు రేపు(28న) పారిశ్రామికోత్పత్తి(ఐఐపీ) వివరాలు వెల్లడికానున్నాయి. ఫిబ్రవరిలో ఐఐపీ 5.2 శాతం వృద్ధిని సాధించింది.

### ఇతర అంశాలు

విదేశీ మార్కెట్లో ముడిచమురు ధరలు 100 డాలర్ల ఎగువకు చేరాయి. డాలరుతో మారకంలో రూపాయి 93.5కు బలహీనపడింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు దేశీ స్టాక్స్‌లో భారీఎత్తున అమ్మకాలు చేపడుతున్నారు. ఈ ప్రతికూల అంశాలు ఇన్వెస్టర్లలో ఆందోళనలు పెంచుతున్నట్లు స్టాక్ నిపుణులు తెలియజేశారు. చమురు ధరల కారణంగా ద్రవ్యోల్బణం, వాణిజ్య లోటు పెరగనుంది. దీంతో ఆర్‌బీఐ కఠిన విధానాలకు తెరతీయవలసి ఉంటుందని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. పశ్చిమాసియా వివాదాలు కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ప్రతికూల ప్రభావం పడుతుందని అంచనా వేస్తున్నారు. వెరసి ఈ వారం స్టాక్ మార్కెట్లు ఆటుపోట్ల మధ్య కదలవచ్చని విశ్లేషకులు తెలియజేశారు.


### సాంకేతికంగా చూస్తే

ప్రధానంగా ఐటీ రంగం 10 శాతం పతనంకావడంతో గత వారం మార్కెట్లు క్షీణించాయి. సాంకేతికంగా చూస్తే ఈ వారం నిఫ్టీకి 23,65023,500 పాయింట్ల వద్ద మద్దతు లభించవచ్చు. ఇక్కడ బలపడితే.. 24,700వరకూ పురోగమించే అవకాశముంది. ఇక సెన్సెక్స్ 76,00075,600 పాయింట్ల వద్ద సపోర్ట్ తీసుకోవచ్చు. ఇక్కడినుంచి పుంజుకుంటే 77,300ను అధిగమించే వీలుంది. ఆపై 78,000 పాయింట్లను దాటవచ్చు. దిగువస్థాయిల్లో 75,000 వద్ద రికవరీకి వీలుంది.

### చమురు షాక్

గత వారం ముడిచమురు ధరలు 810 శాతం ఎగశాయి. దీనికితోడు ఐటీ దిగ్గజాలు నిరుత్సాహపరచడంతో దేశీ స్టాక్ మార్కెట్లు పతన బాటలో సాగాయి. వెరసి గత వారం(2024) నికరంగా సెన్సెక్స్ 1,829 పాయింట్లు(2.3 శాతం) పతనమైంది. 76,664 వద్ద ముగిసింది. నిఫ్టీ 456 పాయింట్లు(1.9 శాతం) కోల్పోయి 23,898 వద్ద స్థిరపడింది. అయితే బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్స్ స్వల్పంగా 0.60.2 శాతం మధ్య నీరసించాయి.

# సూత్రధారులపై ఫోకస్ ఏదీ..?



సైబర్‌నేరాల్లో ఖాతాదారులతోనే కేసుల దర్యాప్తును సరిపెట్టేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీనికితోడు ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో ఉండే సైబర్‌నేరగాళ్ల బ్యాంకు ఖాతాదారులను పట్టుకోవడానికే పరిమితమవుతూ ఇతర రాష్ట్రాల్లో ఉండే క్రిమినల్స్ గురించి కనీసం ఆలోచన కూడా చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సైబర్‌నేరాలలో బ్యాంకు ఖాతాలు, సిమ్‌కార్డులు ప్రధానం. వీటిని ఇక్కడ అమాయకులు, కమిషన్ పద్ధతిలో ఖాతాలు సేకరించడం, సిమ్‌కార్డు డీలర్ల వద్ద నుంచి ఒకేసారి తీసుకోవడం చేస్తున్నారు. వీటిని ఇతర దేశాలలో ఉండే కీలకమైన సైబర్‌నేరగాళ్లకు పంపిస్తుండడంతో అక్కడి నుంచి సైబర్‌నేరగాళ్లు కొత్త కొత్త ఫోన్ నెంబర్లతో అమాయకులకు ఫోన్ చేసి వలేస్తున్నారు. విదేశాల నుంచి వాట్సాప్ కాల్స్‌లలో మాట్లాడుతూ, చాటింగ్‌లు చేస్తూ అమాయకులను సైబర్‌నేరాలలోకి లాగేస్తున్నారు. అత్యాశతో పెట్టుబడి, పార్ట్‌టైమ్ మోసాలు జరుగుతుండగా, భయంతో డిజిటల్ అరెస్ట్‌లు జరుగుతున్నాయి. సైబర్‌నేరగాళ్లు చెప్పినట్లు చేస్తూ సూచించిన బ్యాంకు ఖాతాలలో రూ.లక్షలు డిపాజిట్ చేస్తుంటారు. ఈ బ్యాంక్ ఖాతాల నిర్వహణ రెండు మూడు దశలలో జరుగుతుంది.

### బ్యాంకు ఖాతాలే కీలకం!

బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతోనే దర్యాప్తు ప్రారంభిస్తారు. ఏ బ్యాంకు ఖా తాలో డిపాజిట్ చేశారు, ఆ బ్యాంకు ఖాతా ను ంచి ఎక్కడికెక్కడి బదిలీ అయ్యాయి, చివరకు ఏ ఖాతాకు వెళ్లాయనే అంశాలపై ఆరా తీస్తారు. ఇందులో భాగంగానే పోలీసులు బ్యాంకు ఖాతాదారుల చిరునామాతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేస్తుంటారు. అయితే బ్యాంకు ఖాతాదారులు కొందరు తెలిసి ఆయా ఖాతాలను కమిషన్లకు కక్కుర్తి పడుతూ సైబర్‌నేరగాళ్లకు అప్పగిస్తుండగా, మరికొందరు అందులో అమాయకులు కూడా ఉంటారు. అలాంటి వారిని పోలీసులు గుర్తిస్తూ తగిన విధంగా చర్యలు తీసుకోవడం సాధారణంగా జరుగుతున్న ప్రక్రియ అయితే, గతంలో వివిధ రాష్ట్రాలలో సైబర్‌నేరగాళ్ల గూర్చి పోలీసులు ఆరా తీస్తూ, కీలక నిందితులు ఎవరు అనే విషయంపై దృష్టి పెట్టేవారు. ఈ క్రమంలో కొన్ని కేసులలో కీలక నిందితులను పట్టుకోవడం, మరికొన్ని కేసులలో బ్యాం కు ఖాతాలను సైప్లె చేసే వాళ్లను, ఇంకా కొన్ని కేసులలో బ్యాంకు ఖాతాలు ఇక్కడి నుంచి మేనే జ్ చేస్తున్న ముఠాలను అరెస్ట్‌లు చేస్తూ కేసులను ఛేదించే వారు. అయితే నేడు అంత లోతుగా కేసుల దర్యాప్తు జరపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఫిర్యాదు రాగానే దర్యాప్తు ప్రారంభించి బ్యాంకు ఖాతాల చిరునామాలు ఎక్కడున్నాయని ఆరా తీస్తూ దగ్గరలో ఉంటే నిందితులను పట్టుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలలో ఉన్నారంటే ఆయా కేసులను పక్కన పెట్టేస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సూత్రదారులపై ఫోకస్ ఏదీ..?

ఇప్పటి వరకు ట్రై పోలీస్ కమిషనరేట్ పోలీసులు ఎక్కువగా బ్యాంకు ఖాతాదారులను పట్టుకుంటున్నారు, అయితే సైబర్‌నేరాల్లో దేశం అవ తల ఉండి నేరాలు చేస్తున్న సూత్రధారులపై ఫోక స్ ఏదీ అంటూ సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నా రు. బ్యాంకు అధికారుల సహకారంతో ఎక్కడికక్కడే సైబర్‌నేరాలను కట్టడి చేసేందుకు అవకాశాలున్నా ఆ దిశగా ప్రయత్నాలు జరగకపోవడమే నేరగాళ్లకు కలిసోస్తుందని పలువురు పేర్కొ ంటున్నారు. ఇప్పటికైనా కీలక సూత్రధారులపై ఫోకస్ పెట్టాలని బాధితులు కోరుతున్నారు.